క్లుప్తంగా

నల్లా కనెక్షన్ ప్రారంభం



నల్లా కనెక్షన్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల(బీసీ) కళాశాల, బాలికల వసతి గృహానికి తాగునీటి సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన స్పందించిన వసతి గృహానికి మిషన్ భగీరథ పైపులైన్ వేయించి సమస్యను పరిష్కరించారు. ఆదివారం వసతి గృహం విద్యార్థులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జయశ్రీ, మాజీ వార్డు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న దామోదర రాజనరసింహ

వట్‌పల్లి (అందోల్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ అన్నారు. మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మండల పరిధిలోని కేరూరు గ్రామానికి చెందిన బర్ల రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

శాకాహార విశిష్టతపై అవగాహన



శాకాహారం అవగాహన కల్పిస్తున్న వెజిటేరియన్ క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మీ

పటాన్‌చెరు: హైదరాబాద్ వెజిటేరియన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ శాకాహార దినోత్సవం నిర్వహించారు. ఆదివారం బీరంగూడ పరిధిలోని ప్రణీత్ ప్రణవ్ హోమ్స్ కమ్యూనిటీలో శాకాహార విశిష్టతపై అవగాహన కల్పించారు. హైదరాబాద్ వెజిటేరియన్ క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మీ మాట్లాడుతూ శాకాహారాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం శాకాహారం - మానవ జీవితంపై ప్రభావం అనే అంశంపై 5 నుంచి 16 ఏళ్ల వయస్సుగల పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సభ్యులు, దినేష్, ఫణీంద్ర, కుమారి మినీషా, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి సిస్టర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని పొట్టిపల్లి శివారులోని పురాతన సిద్దేశ్వర ఆలయాన్ని ఎస్సీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ వై.నరోత్తం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని లింగానికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి తదిత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, కేతకి ఆలయ పాలకమండలి సభ్యులు సిద్దన్న పాటిల్, నాగేశ్వర్ సజన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి పూజలు

మునిపల్లి(అందోల్): మండల కేంద్రమైన మునిపల్లిలో ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ వినాయకుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో మునిపల్లి సర్పంచ్ రమేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి సాయికుమార్, మాజీ మండల అధ్యక్షుడు వారణాసి సతీశ్ కుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

జహీరాబాద్: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ చీఫ్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోహీర్ ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీలు నాగిశెట్టి రాథోడ్, రాందాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు శ్రమదానం

పల్లెలు, పట్టణాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఏక్ తారీఖ్.. ఏక్ గంట.. ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించారు. చీపురు పట్టి రోడ్లను, చెత్తాచెదారం నిండిన ప్రదేశాలను శుభ్రం చేశారు. స్వచ్ఛత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



సదాశివపేటలోని 12 వార్డులో రోడ్డును శుభ్రం చేస్తున్న వార్డు కౌన్సిలర్, బీజేపీ నాయకుడు పులి మామిడి రాజు, మహిళలు



సంగారెడ్డిలో చెత్త తొలగిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి



ప్రభుత్వాసుపత్రి పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



తడ్కల్‌లో రోడ్డు ఊడుస్తున్న సర్పంచ్ మనోహర్



సంగారెడ్డి మండలంలో శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



కోహీర్: కవేలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న గ్రామస్తులు



రామచంద్రాపురంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్తను తొలగిస్తున్న కార్పొరేటర్ పుష్ప నగేష్



అమీన్‌పూర్ బైపాస్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి



పటాన్ చెరులో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



నారాయణఖేడ్: హుక్రాన(జ)లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: మిలాద్ ఉన్ నబీని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శాంతి నగర్ రోడ్డు వద్ద మిలాద్ ఉన్ నబీ ర్యాలీని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ ప్రారంభించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షేక్ అంజాద్, డాక్టర్ శ్రీహరి , వాజిత్, కౌన్సిలర్ షేక్ సాబేర్, మసూద్, యూనిస్, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న చింతా ప్రభాకర్

పేదలకు ఉచిత సామూహిక వివాహాలు

జహీరాబాద్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలను జరిపించారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ తరఫున ఉచితంగా దుస్తులు, సామగ్రి, పెళ్లి వస్తువులను అందజేశారు. ఐదు జంటలకు వివాహం జరిపించారు. వధువులకు రైతు సంఘం నాయకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఢిల్లీ వసంత్ ఆర్థిక సహాయం అందించారు. నూతన వధూవరులను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్, బ్రూవరీస్ సంస్థ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌లు నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గోరేమియా సికిందర్, జహంగీర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్ చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మిలాద్ ఉన్ నబి వేడుకలను ఆదివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మునీర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి ఆదివారం అన్నారు. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణి నగర్‌లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి రూ.11,550 విలువ చేసే మద్యం సీజ్ చేసి, విక్రయిస్తున్న చావాన్ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ఝరాసంగం(జహీరాబాద్): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చిల్లమామిడి గ్రామానికి చెందిన బోయిని మల్లయ్య(36) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చిల్కపల్లి గ్రామ శివారులోని పాత కంకర్ మిషన్ నీటి గుంతలో మోటార్ సైకిల్ తో సహాదూకాడు. గమనించిన పలువురు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు.

యువకుడి మృతదేహం గుర్తింపు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని రాయిపల్లి రోడ్డులోని పొదల్లో శనివారం లభించిన యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని సంజీవన్‌రావుపేట గ్రామానికి చెందిన సామల రాజు (23) గణేష్ నిమజ్జనం రోజు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్‌కి చెందిన మోతీలాల్ కూతురు సోనీ బాయ్(28) శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సోనీ బాయ్ కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆదివారం కూతురు అదృశ్యంపై తండ్రి మోతీలాల్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో..

- ఐదుగురికి గాయాలు
- క్షతగాత్రుల్లో తండ్రీ కొడుకులు, ఆర్టీసీ డ్రైవర్

పటాన్‌చెరు టౌన్: రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో తండ్రీ, కొడుకులకు గాయాలైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఘనపూర్‌కు చెందిన మహేష్ గౌడ్(33), తన కుమారుడు సాయి తేజను బైక్‌పై భానూర్‌లోని కరాటే స్కూల్‌కు తీసుకెళ్తున్నాడు. ఇదే సమయంలో నందిగామ శుభ గృహ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనదారుడు మహేష్ గౌడ్ బైక్‌ను ఢీకొట్టాడు.ఈ ఘటనలో మహేష్ గౌడ్‌తో పాటు అతడి కుమారుడు సాయితేజకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారి బంధువు రాజుగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణఖేడ్: పట్టణ శివారులో ఆదివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఖేడ్ మండలం వెంకటాపూర్‌కు చెందిన అవుటి సుదర్శన్, నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శనిగారం వెంకటేశ్, కృష్ణ బైకులపై వస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ డిపో సమీపంలో చక్రాల బావి వద్ద నారాయణఖేడ్- నిజాంపేట జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు ఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ వెంకటేశ్ పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.



నారాయణఖేడ్ లో బైక్‌లు ఢీకొనడంతో రోడ్డుపై పడిన వాహనదారులు

ప్రగతి పథంలో తెలంగాణ

- రూ.5 కోట్లతో జానకం పేట అభివృద్ధి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి జానకంపేట గ్రామ అభివృద్ధే నిదర్శనమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధి జానకంపేట గ్రామంలో రూ.5 కోట్లతో చేపట్టిన నూతన గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్లు, కుల సంఘాల భవనాలు, క్రీడా ప్రాంగణం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు, పల్లె ప్రకృతి వనం తదితర అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ పాండు యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ చౌరస్తా నుంచి గ్రామపంచాయతీ వరకు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జానకంపేట లాంటి మైనర్ పంచాయతీని సైతం రూ.5 కోట్లతో అభివృద్ధి చేశామంటే కేవలం సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమైందన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు త్వరలో ముదిరాజ్, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించడంతోపాటు ఎన్నికల అనంతరం గ్రామస్తుల అవసరాల కోసం ఆధునిక వసతులతో ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కృష్ణ, భాస్కర్ గౌడ్, శ్రీకాంత్, మల్లేష్, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్రం వచ్చాకే అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీసాయి నగర్ కాలనీలో రూ.2.37 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. శ్రీ సాయి నగర్ కాలనీ సొసైటీ కార్యాలయం కోసం అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ స్థలాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, పరమేష్ యాదవ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఎన్పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి గోపాల్

సదాశివపేట(సంగారెడ్డి): దివ్యాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఐదు శాతం కేటాయించాలని ఎన్పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి టి.గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ పరిధిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులపై వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రత్యేక పరికరాలు అందించాలని, తీవ్ర వైకల్యం ఉన్నవారికి రూ.25 వేల ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డి డివిజన్ కమిటీ ఎన్నిక

గౌరవ అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా బాలయ్య, అధ్యక్షుడిగా గఫార్, కార్యదర్శిగా వెంకయ్య, ప్రచార కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా కిష్టయ్య, మరో 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.



గఫార్



బాలయ్య

సంక్షిప్త వార్తలు

◆ 7న జాబ్‌మేళా

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ఈనెల 7వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఎంపీ బీబీ పాటిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జాబ్ మేళా కొనసాగుతుందన్నారు. ఐటీ, బ్యాంక్, లాజిస్టిక్, ఫార్మసీ, ఆటో మొబైల్, మార్కెటింగ్, సివిల్ తదితర ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారని చెప్పారు.

◆ కాలనీల అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు సాయిరాం నగర్ కాలనీ ఫేజ్ 2 కాలనీ ముఖద్వారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగా రెడ్డి, కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కృష్ణ, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా తుర్కాపల్లికి చెందిన రుక్మిణికి రూ.26,500, చౌకాన్‌పల్లికి చెందిన జానాబాయికి రూ.15 వేలు, గోసాయిపల్లికి చెందిన లక్ష్మయ్యకు రూ.38 వేలు చెక్కుల రూపంలో మంజూరయ్యాయి. ఈ చెక్కులను నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

◆ ఇంగ్లీష్ శిక్షణా తరగతులు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉచిత ఇంగ్లీష్ శిక్షణ తరగతులు ఎస్‌సీఈఆర్‌టీ సహకారంతో విల్ టు కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో 40 రోజులు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని ఏఎంఓ అనురాధ తెలిపారు. ఆదివారం మొదటి శిక్షణ తరగతి సంగారెడ్డి సైన్స్ సెంటర్‌లో నిర్వహించామన్నారు. 300 మంది టీచర్లు హాజరయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

◆ నేడు రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి, మహాత్మాగాంధీ జయంతులను పురస్కరించుకొని సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. పీకేఆర్ ట్రస్టు, లయన్స్‌క్లబ్ సౌజన్యంతో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐల ఆధ్వర్యంలో శిబిరం కొనసాగుతుందన్నారు.

◆ నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: పట్టణంలో మాణిక్‌ప్రభు భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు భజనలు చేస్తూ కీర్తనలు గానం చేశారు. నగర సంకీర్తన 1 వార్డు గుండా కొనసాగింది. అనంతరం నిర్వాహకులు వారికి ఫలహారం అందజేశారు.

◆ బీజేపీలో చేరిక

నారాయణఖేడ్: ప్రజలు ఇప్పటివరకు పాలించిన మూడు పార్టీలతో విసిగిపోయి బీజేపీ వైపు మొగ్గు చూపుతుండటంతో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప తెలిపారు. మండలంలోని పంచగామ గ్రామంలో ఆదివారం పలువురు బీజేపీలో చేరారు. వారి మెడలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ హనుమాన్ చాలీసా పారాయణం

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఫసల్ వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో హనుమాన్ చాలీసా సహస్రవర్తన పారాయణం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వెయ్యి మంది ఒకేసారి హనుమాన్ చాలీసాను వెయ్యిసార్లు పఠించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సదాశివపేటలో ఉపాధ్యాయులతో 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సమితి అధ్యక్షులు పోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్నం సురేష్, కోశాధికారి గారెలా విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు పట్నం విరేశలింగం తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. హెచ్ఎం వెంకటయ్యను ఘనంగా సన్మానించారు.

భవానీ మాత భక్తుల పాదయాత్ర

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని భక్తిధాం(బల్కంచెల్క) తండా నుంచి భవానీ మాత దీక్షదారులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మందిరం ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణ శాఖ అధికారి మూడ్ కిషన్‌సింగ్ ఆధ్వర్యంలో బల్కంచెల్క తండా, రాంచందర్ తండా, నాగధర్, మునిగేపల్లి తండాలకు చెందిన భక్తులు అమ్మవారి మాలధరించి తుల్జాపూర్ భవానీ మాత దర్శనం కోసం బయల్దేరారు. ముందు తండాలోని మందిరంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. సిర్గాపూర్‌లో కొద్దిసేపు విడిది చేశారు. వారికి గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు చరణ్‌సింగ్ పండ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దంపతులు శాంతిబాయి ధూమనాయక్, దీక్షదారులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400